క్లుప్తంగా

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, నాయకులు

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని ఉడొస్‌పేట గ్రామంలో జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఖాళీ స్థలాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ గురువారం పరిశీలించారు. త్వరలో లేఅవుట్ వేసి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేడా శ్రీనివాసులురెడ్డి, చెంతాటి కరుణాకర్, వల్లూరు నాగేశ్వర్‌రావు, పరిశినేటి రాజేష్, గోళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ



సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామం కాలువకట్ట మీదనున్న గిరిజన కుటుంబాలకు వెన్నెలకంటి రాఘవయ్య మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్వర్లు గురువారం ఆర్థికసాయం, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు, సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పాల్గొని 17 గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రసాద్, డి.శరవణ, వై.బుజ్జయ్య వెంకయ్యచౌదరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సోమశిల: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఊరిబిండి చేతన్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం ఉప్పలపాడు గ్రామంలో ప్రీమియర్ లీగ్–2024 క్రికెట్ పోటీలు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బొద్దుకూరు వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్గనైజర్లు శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్, శివ, సుమంత్, లహరీష్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని పునఃపరిశీలించాలి

ఆత్మకూరు: ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని పునః పరిశీలించాలని న్యాయవాదులు కోరారు. పట్టణంలోని కోర్టు వద్ద గురువారం న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, షేక్ నజీర్, సిరాజ్ అహమ్మద్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రికి ఘన నివాళి



మర్రిపాడు: మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల గ్రంథాలయ ఇన్‌చార్జి నారాయణరావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ వర్సెస్ క్రీడాకారులు

వరికుంటపాడు: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల నిర్వహణలో స్థానిక ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి తీరు వివాదాస్పదమైంది. నిష్పాక్షపాతంగా వ్యవహరించాల్సిన ఆమె ఒక వర్గం వైపు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వరికుంటపాడు కబడ్డీ క్రీడాకారులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మల్లికార్జున, స్థానిక ఎస్సై రంగ ప్రవేశం చేసి శుక్రవారం ఉదయం రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఫైనల్స్ పోటీలు జరిగేలా ఒప్పించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను చేర్చారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతలపాళెంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి గుండెల్లో నిలిచారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం తదితరాలను నెలకొల్పి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కావాలని స్థానికులు అడగడంతో అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్‌జే కన్వీనర్ టి.ఇందిరమ్మ, సర్పంచ్ ప్రశాంతి, నాయకులు మహాదేవ, కొలిమి బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత

ఆత్మకూరు: ఇళ్లను, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 21వ వార్డు ఉలవదిబ్బ సమీపంలో చెరువు కాలువ పక్కనే చేపల వ్యాపారులు వ్యర్థాలను కాలనీ సమీపంలో వేస్తుండడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన మున్సిపల్ ఏఈ జె.ప్రసాద్‌తో కలిసి గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. చేపల వ్యాపారులతో మాట్లాడారు. వారికి చెత్తబుట్టలను అందజేస్తామని, బయోవేస్ట్ తరలించే మున్సిపల్ కార్మికుల ద్వారా చేపల మార్కెట్ వ్యర్థాలను తరలించేలా చేస్తామని, వ్యాపారులు సహకరించాలని కోరారు. సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇకపై చేపల మార్కెట్ వ్యర్థాలను బహిరంగంగా వేయవద్దని సూచించారు.



ఉలవదిబ్బ వాసులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి: ఉదయగిరి పంచాయితీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం జరిగే వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైఎస్సాసీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారు గురువారం పట్టణంలోని చేజర్ల సుబ్బారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మండల మాజీ ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసులుయాదవ్, ఉప సర్పంచ్ ముర్తూజాహుసేన్, దాసరుపల్లె సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు చేజర్ల సుధాకర్‌రెడ్డి, ఎస్దానీ, యు.శ్రీనివాసులు, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేజర్ల సుబ్బారెడ్డి తదితరులు

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఉదయగిరి : మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం విధుల్లో చేరి ఎంఈఓ–1 మస్తాన్‌వలికి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు గత నెల 20వ తేదీ నుంచి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎంటీఎస్ అమలు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం, సీఆర్ ఎంటీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమ్మెబాట పట్టారు. తాజాగా బుధవారం ప్రభుత్వంతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నాయకులు జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు సమ్మె విరమించారు. ఈ మేరకు ఎంఈఓకు వినతిపత్రం అందించి విధుల్లో చేరారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సోమశిల జలాలు సద్వినియోగం చేసుకోండి

మర్రిపాడు: సోమశిల జలాశయం ఉత్తరకాలువ పరిధిలో డీసీపల్లి చెరువు ఆయకట్టు రైతులు సోమశిల జలాలను సద్వినియోగం చేసుకోవాలని సోమశిల ప్రాజెక్ట్ నాలుగో డివిజన్ ఏఈ పరమేశ్వరరెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం డీసీపల్లి చెరువు ఆయకట్టు రైతులతో గురువారం ఆ గ్రామంలో ఆయన మాట్లాడారు. మార్చి మొదటి వారం వరకు ఉత్తరకాలువకు సోమశిల జలాలు డీసీపల్లి చెరువు వరకు అందే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఎవరూ వరినార్లు పోయవద్దని తెలిపారు. కార్యక్రమంలో డీసీపల్లి గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఈ పరమేశ్వరరెడ్డి

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మర్రిపాడు: మండలంలోని పిచ్చివెంగంపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం జరిగింది. వివరాలు.. పిచ్చివెంగంపల్లికి చెందిన అన్నవరపు మాల్యాద్రి – సుబ్బమ్మల కుమారుడు సురేష్ (19) ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అన్నవరపు సురేష్ మృతదేహం

ఖోఖో ఫైనల్స్‌లో విజేత గణేశ్వరపురం జట్టు

వరికుంటపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని క్రీడా మైదానంలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా గురువారం జరిగిన ఖోఖో ఫైనల్స్‌లో మండలంలోని గణేశ్వరపురం మహిళా జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టు వేంపాడు, తూర్పు రొంపిదొడ్ల సచివాలయాల జట్లపై తలపడి విజయం సాధించింది. విజేతలను తహసీల్దార్ నేలపాటి మల్లికార్జున, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దాసరి ఎర్రా ఓబయ్య, నాయకులు బాధం వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేత గణేశ్వరపురం జట్టును అభినందిస్తున్న అధికారులు, నాయకులు

గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

వరికుంటపాడు: మండలంలోని పశుపోషకులు పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు సోకే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైనదని, ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. మండలంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల ఆఖరు వరకు కొనసాగుతుందని తెలిపారు. మండలంలో 13 వేల పశువులు ఉండగా, ఇప్పటి వరకు 2,500 పశువులకు టీకాలు వేశామన్నారు. నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. పశుపోషకులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

లెప్రసీ సర్వే

వరికుంటపాడు: మండలంలో కుష్టు వ్యాధిగ్రస్తుల నిర్ధారణ సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారిణి కరిష్మా గురువారం తెలిపారు. మండలంలో 9,653 గృహాలను సిబ్బంది సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 8,500 గృహాల్లో సర్వే నిర్వహించి 88 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వేలో 45 కుష్టువ్యాధి అనుమానిత కేసులను గుర్తించామన్నారు. నిర్ధారణ కోసం వారిని సర్వే బృందం ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేస్తారన్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికీ తిరిగి శరీరంపై స్పర్శ లేని, రాగి, బూడిద రంగు మచ్చలున్న వారిని గుర్తించినట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు 29 బృందాలను నియమించినట్లు తెలిపారు.

నేడు వీపీఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లె గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీపీఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ అధినేత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వీపీఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి మెగా క్రికెట్ పోటీలు

ఉదయగిరి: మండలంలోని గుడినరవ గ్రామ ఎస్సీకాలనీ క్రీడా మైదానంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేత జట్టుకు రూ.25,000, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి 7904828190 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు సమతా మానవహారం

ఆత్మకూరు: సామాజిక సమతా సంకల్పంలో భాగంగా మున్సిపల్ పరిధిలో మానవహారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ మానవహారం నిర్వహిస్తున్నామని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో జరగనున్న ర్యాలీ అక్కడి నుంచే ప్రారంభం అవుతుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, సచివాలయాల ఉద్యోగులు, ఎన్‌జీఓలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాస్థాయి షటిల్ పోటీలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని శుక్ర, శని వారాల్లో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వి.బ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శుక్రవారం ఉదయం 10 గంటల లోపు తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'రాజన్న రచ్చబండ'

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి 'రాజన్న రచ్చబండ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బండకిందపల్లి గ్రామంలో 'రాజన్న రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల క్రితం గ్రామంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన మరో రెండు రోజుల్లోనే మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను తీసుకొచ్చి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే గురువారం అధికారులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని కొన్ని కంకర క్వారీల వల్ల పంటలు నష్టపోవడంతోపాటు రహదారి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. అంతేకాక ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తుండడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామన్నారు. అన్నం తినడానికి కూడా దుమ్ము ధూళితో నరకయాతన పడుతున్నామని వాపోయారు. భారీ వాహనాల కారణంగా విపరీతమైన దుమ్ముతో పంటలు నష్టపోతున్నామని తెలిపారు. రహదారిపై భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. మైనింగ్ డీడీ చంద్రశేఖర్ స్పందిస్తూ గ్రామస్తులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే క్వారీలను నిలిపివేసేలా తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రానికి అనుబంధంగా గ్రామంలోని ఒక గదిలో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. తమ గ్రామంలో సచివాలయం లేకపోవడంతో నర్రవాడకి వెళ్లాల్సి వస్తోందని తెలపడంతో స్పందించిన రాజగోపాల్‌రెడ్డి ఇకపై ప్రతి బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రామంలోనే సచివాలయ ఉద్యోగులు గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించడంతోపాటు ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారం కోసం 8 స్తంభాలు కావాలని గ్రామస్తులు కోరారు. మెయిన్ రోడ్ నుంచి బండ కింద పల్లి గ్రామం వరకు రహదారి నిర్మించడానికి అటవీ అనుమతులు వచ్చాయని ఉదయగిరి రేంజ్ ఆఫీసర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి 15 రోజుల్లో రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అలాగే మరికొన్ని సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో సమస్యలు పరిష్కరించాలని వెంటనే సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, తహసీల్దార్ రామ్మోహన్, సర్పంచ్ రమేష్‌రెడ్డి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, సింగవరపు గంగాధర్, గ్రామస్తులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



బండకిందపల్లిలో 'రాజన్న రచ్చబండ' కార్యక్రమం నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉత్సాహంగా క్రీడా పోటీలు

వింజమూరు(ఉదయగిరి): మండల కేంద్రం వింజమూరులో ముస్లిం మైనార్టీ లీగ్ క్రికెట్ పోటీలను గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు మాసిలామణి, నాయకులు పల్లాల కొండారెడ్డి, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఏఎస్‌పేట మండల కేంద్రంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. మండలస్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువారం జగిరిన పోటీలను మండల అధికారులు పర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

క్రీడా పోటీలను పరిశీలించిన అధికారులు

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' మండలస్థాయి క్రీడా పోటీలను గురువారం తహసీల్దార్ నాగరాజు పరిశీలించారు. ముందుగా షటిల్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం షటిల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ క్రీడా పోటీల్లో మండల పరిధిలోని పలు షటిల్ జట్లు పాల్గొని పోటాపోటీగా ఆడాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు జానకిరాం, మల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతసాగరం జట్టు విజయం

సోమశిల: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా గురువారం అనంతసాగరంలో జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో రేవూరు సచివాలయం, అనంతసాగరం సచివాలయం–1 జట్లు పాల్గొనగా అనంతసాగరం జట్టు విజయం సాధించిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి సహకారంతో అనంతసాగరం జాలీబాయ్స్ యూత్ ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిమొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

చేజర్ల: 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రికెట్ సెమీ ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. గురువారం మండలంలోని పాతపాడు, ఆదూరుపల్లి క్రికెట్ గ్రౌండ్స్‌లో ఈ పోటీలు జరిగాయి. ఆదూరుపల్లిలో జరిగిన పోటీల్లో పెరుమాళ్లపాడు జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. పాతపాడులో జరిగిన పోటీల్లో ఆదూరుపల్లి జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. కార్యక్రమంలో ఎంఈఓ–2 మస్తానయ్య, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకే..

ఆత్మకూరు: గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎస్ఆర్‌జేడీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో గురువారం ఉత్సాహంగా సాగాయి. క్రికెట్ పోటీలు రెండో రోజు గురువారం పోటాపోటీగా సాగాయి. ఎస్ఆర్‌జేడీ కళాశాల ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టాస్ వేసి ప్రారంభించారు. మండలస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరుపాళెంకు క్రీడాకారులు సీహెచ్ కార్తీక్, ఎ.అశోక్ విజేతలుగా నిలిచారు. 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నియోజకవర్గ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని కమిషనర్ తెలిపారు. శుక్రవారం నుంచి ఎస్ఆర్‌జేడీ కళాశాల ప్రాంగణంలో ఫైనల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు తిరుపతయ్య, సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, సురేష్, మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువలను ఆక్రమించి అక్రమార్కులు పక్కా నిర్మాణాలు చేపట్టడం సర్వసాధారణమైంది. పది రోజుల క్రితం కొందరు ఆర్డీఓ మధులతకు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పరిశీలించి అవి ప్రభుత్వ భూములు అని గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. అదే క్రమంలో పట్టణంలోని సోమశిల రోడ్డు మలుపు వద్ద చెరువు అలుగు కాలువ, దాని పక్కనే పారుదల కాలువలపై చిన్నపాటి బంకులు ఏర్పాటు చేసుకొని వాటి వెనుకనే కాలువలపై శ్లాబులు పోసి పక్కా నిర్మాణాలు చేపడుతుండడాన్ని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు నిర్మాణాలు నిలిపివేయాలని తెలిపారు. అవి ప్రభుత్వ భూములని తెలిపి నోటీసులు అందజేశారు. అయితే ఇది జరిగిన పది రోజులకే సోమశిల రోడ్డు మలుపు వద్ద మెయిన్ బజారుకు ఆనుకొని ఇరిగేషన్ కాలువలపై శ్లాబు పోసి పక్కా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలు ఓ ఉపాధ్యాయుడు, ఆరోగ్య శాఖలో పనిచేసే మరో ప్రభుత్వ ఉద్యోగి ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు సమాచారం. కాగా పది రోజుల క్రితం ఈ విషయంపై పత్రికల్లో కథనం రావడంతో సదరు ప్రభుత్వ టీచర్ తానొక్కడినే ఆక్రమించలేదని, చాలా మంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, తన పేరు సైతం పేపరులో రాసుకోండంటూ విలేకరిని ఫోన్‌లో బెదిరించాడు. ఆయన ఆధ్వర్యంలోనే రాత్రింబవళ్లు ఇరిగేషన్ కాలువపై పక్కా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు మెయిన్ రోడ్డులోకి కనిపించకుండా, పాత గోడలు, షట్టర్ అలానే ఉంచి లోపలి వైపే నిర్మాణాలు చేస్తుండడం గమనార్హం. రెవెన్యూ అధికారులు తమ భూములను గుర్తించకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఇలా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం ఆక్రమణదారులకు వరంలా మారిందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై ఉన్నతాధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా గత వారమే అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని, తహసీల్దార్‌కు ఆ భూములు గుర్తించి సర్వే చేసి ఏ శాఖకు చెందినవో తేల్చి చెప్పాలని లేఖ రాసినట్లు తెలిపారు.



ఇరిగేషన్ కాలువపై జరుగుతున్న అక్రమ నిర్మాణం